క్లుప్తంగా

దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట నేడు



బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయం

పరవాడ: ఈ. బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9.57 గంటలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్వో నాయుడుకు చెక్కు అందజేస్తున్న దాత భాస్కరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని పెద్దవాల్తేరుకు చెందిన పేరి రామ భాస్కరరావు అనేదాత లక్ష 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో నాయుడుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.

ఏడుగురు పందెంరాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెం శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎల్. సురేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం ఈ దాడులు నిర్వహించామన్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి రూ.11,320 నగదు తో పాటు మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

ముత్యాల తలంబ్రాల అందజేత



ఏఈవోకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న దాత

సింహాచలం: వచ్చే నెల 2న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత శివశంకర్‌రాజు రూ.90వేల విలువ చేసే ముత్యాల తలంబ్రాలు వితరణగా ఇచ్చారు. సింహగిరిపై ఆలయంలో ఏఈవో నరసింహరాజుకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రామలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతుడు

సింహాచలం: పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు విశాఖ జీఆర్‌పీ ఎస్‌ఐ బి.కామేశ్వరరావు తెలిపారు. సుమారు 75 ఏళ్ల ఉన్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతిచెందినట్టు తెలిపారు. నీలం రంగు నిక్కర్, కనకాంబరం రంగు హాఫ్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్న వ్యక్తి మొలతాడుకు బీరువా తాళం చెవి ఆకారం కలిగిన తాళాలు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 8985752107 నంబరులో సంప్రదించాలని కోరారు.

నాణ్యంగా.. నిరంతరాయంగా..

- చురుగ్గా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు
- వేసవిలో కోతలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యం



నూతనంగా పునరుద్ధరించిన బొండవానిపాలెం విద్యుత్ లైన్

సబ్బవరం: అసలే వేసవి.. ప్రతి ఇంట్లో ఫ్యాన్లు.. ఏసీలు.. కూలర్లు గిర్రుగిర్రుమంటాయి. ఒక్కసారి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు అనుగుణంగా నిర్వహణ పనులు చేపడుతున్నారు. చిన్నచిన్న మరమ్మతులతో పాటు అవసరమైన చోట సామర్థ్యం పెంపు.. నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా పంపిణీ చేసేందుకు మార్గం సుగమం కానుంది.

పాతవి తొలగించి..

మండలంలోని పలు ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ లైన్లలో కాలం చెల్లిన స్తంభాలు స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు నూతన పరికరాలను టెక్నికల్ సిబ్బంది అమర్చుతున్నారు. లైన్లలో స్తంభానికి, స్తంభానికి మధ్య దూరం అధికంగా ఉండడంతో లూజ్ స్పేస్ ఏర్పడుతుంది. దీంతో వర్షాలు కురిసేటప్పుడు.. చిన్నపాటి గాలులకు సైతం విద్యుత్ వైర్లు కలిసిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఆ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆయా పోల్స్ మధ్య పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను సిబ్బంది సరిచేస్తున్నారు.

నెల రోజులుగా పనులు

నెల రోజులుగా రోజు సుమారు 25 మంది వరకూ టెక్నికల్ లేబర్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే మండలంలోని 11 కేవీ లైన్లలో సుమారు 220 వరకూ విద్యుత్ పోల్స్ పునరుద్ధరించారు. గ్రామాల వారీగా కాలం చెల్లిన విద్యుత్ లైన్లు పునరుద్ధరించేందుకు అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నారు.

30 స్తంభాల పునరుద్ధరణ

మండలంలోని గొటివాడ శివారు బొండవానిపాలెం, సాలాపువానిపాలెం గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని ప్రజలు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనలతో నూతనంగా సుమారు 30 వరకూ 9.1 మీటర్ల పోల్స్‌తో విద్యుత్ లైన్ల పునరుద్ధరించారు.

మండలంలోని అమృతపురం,ఇరువాడ,గుల్లేపల్లి,మర్రిపాలెం,అయ్యన్నపాలెం,బోదువలస,బుదిరెడ్లపాలెం,ఎల్లుప్పి,అడ్డూరు,బంగారమ్మపాలెం,లగిశెట్టిపాలెం,బొండవానిపాలెం,సాలాపువానిపాలెం, గొటివాడ గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లను ఇప్పటికే పునరుద్ధరించారు. మరిన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.



విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు చేపడుతున్న సాంకేతిక సిబ్బంది

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తున్నాం. దీనిలో భాగంగా కాలం చెల్లిన స్తంభాలను పునరుద్ధరించడంతో పాటు లైన్ల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో నిర్వహణ పనులు పూర్తయ్యాయి.

– నిరీక్షణ్ అంబేడ్కర్, ఏడీఈ,ఈపీడీసీఎల్ సబ్బవరం

పైడమ్మబంద ఆయకట్టు రైతులకు తీపి కబురు



వ్యవసాయ బోరు నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని లుపిన్ ఫార్మా యాజమాన్యం సౌజన్యంతో పరవాడ పైడమ్మ బందలో ఏర్పాటు చేయనున్న బోరు నిర్మాణ పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. పైడమ్మ బంద ఆయకట్టు రైతులు పంటలకు నీరందక 10 ఎకరాల విస్తీర్ణంలో పంటలు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని పొలంబడి కార్యక్రమంలో పాల్గొవడానికి వచ్చిన వ్యవసాయాధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. అధికారులు సమస్యను లుపిన్ ఫార్మా యాజమాన్యానికి వివరించారు. స్పందించిన లుపిన్ ఫార్మా యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న పైడమ్మ బందలో వ్యవసాయ బోరు నిర్మించడానికి వీలుగా రూ.1.95 లక్షలు మంజూరు చేశారు. వర్క్ ఆర్డర్ ప్రతులను పరిశ్రమ సీఎస్సార్ మేనేజర్ దక్కిన వెంకటనారాయణ బుధవారం రైతు ప్రతినిధులకు అందజేశారు.దీంతో పనులు ప్రారంభించారు. వార్డు సభ్యుడు సిరపరపు రాజేష్, పైడి బంద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు గండి నమో, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు కె.చినబాబు, రైతులు ఎస్.ఎస్.నాయుడు, ఎస్.సన్యాసినాయుడు, పైల మురళి, ఎస్.సన్యాసినాయుడు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు



జగనన్న కాలనీలో వీధి లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

పరవాడ: స్థానిక జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి లైట్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.రామారావు, సీనియర్ నాయకులు పైల హరీష్, పైల పైడింనాయుడు, సన్యాసినాయుడు, లైన్‌మెన్ బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో పూజలు అందుకున్న లలితాంబిక

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ట గావించిన లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖచిత్రం మధ్యలో అధిష్ఠంపజేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం , ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్ చందు మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్యతోపాటు భక్తులు పాల్గొన్నారు.

సేవకులకు ఘన సత్కారం



వివిధ రంగాల్లో సేవలు చేసిన వారిని సత్కరిస్తున్న హిందీ మంచ్ ప్రతినిధులు

సింహాచలం: ఉగాది పండగ పురస్కరించుకుని హిందీ మంచ్ ఆధ్వర్యంలో పెందుర్తిలోని కైట్స్ స్కిల్స్ కంప్యూటర్ సంస్థ కార్యాలయంలో బుధవారం పలు రంగాల్లో సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. సమాజ సేవ విభాగంలో గొర్లె రామునాయుడు, ఉపాధ్యాయుల సేవా విభాగంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బమ్మిడి రాజారావు, విద్యారంగంలో మోరి సింహాచలం, గిరిజన సేవ విభాగంలో టి.నాగేశ్వరరావును ఘనంగా తస్కరించారు. హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనె శ్రీధర్, నాదళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సత్యవెంకట హిమ బిందు



మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సత్య వెంకట హిమబిందు

పద్మనాభం: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు సూచించారు. మండలంలోని కురపల్లిలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, అశోక్ హీరావత్ సంయుక్తంగా మహిళా హక్కులు, చట్టాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. గృహ హింస చట్టం 498/ఏను సరైన మార్గంలో అనుసరించాలని తెలిపారు. బాల్య వివాహ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్నారని, ఇది చట్ట రీత్యా నేరమన్నారు. భర్త నుంచి కోర్టులో విడాకులు తీసుకున్న మహిళ తనతోపాటు పిల్లలకు మనోవర్తి పొందేందుకు చట్టం అవకాశం కల్పించిందన్నారు. అబార్షన్లు, భ్రూణ హత్యలు నేరమన్నారు. బాలికలను లైంగికంగా వేధించేవారికి పోక్సో చట్టంతో గుణపాఠం చెప్పాలని సూచించారు.

ఉచితంగా న్యాయ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభిస్తామని సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవ అథారిటీ, పారా లీగల్ వలంటీర్, న్యాయవాది ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. సమస్యలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. విద్య, ఆస్తి, రాజకీయ రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. లింగ వివక్ష చూపకుండా ఆడ పిల్లలను తప్పనిసరిగా చదివించాలన్నారు. డొమస్టిక్ వయలెన్స్ యాక్ట్‌ను అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 250 మంది పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పౌరాణిక రంగస్థల నటుడు ఉప్పాడ అప్పారావును సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.సునీల్ కుమార్, రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, భీమిలి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎస్.జనార్ధనరావు, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ డి.పుల్లారావు, ఎస్.శ్రీలక్ష్మి, జి.మైథిలి, ఊహా మహంతి, అశోక్ హీరావత్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు దుర్భరం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు నిర్వాసితుల జీవితాలను రోడ్డున పడేసిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 769వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఓబీసీ ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా ఉగాది పండగను సంతోషంగా జరుపుకొంటుంటే, ఉక్కు కార్మికులు మాత్రం తమ జీవితాల గురించి చింతిస్తూ బాధతో పండగను జరుపుకొంటున్నారన్నారు. 30 ఏళ్లగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్ ప్లాంట్‌ను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు ఆ పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని, కార్మికులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సింహగిరికి ఉగాది శోభ

- విశేషంగా నిత్య కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన అప్పన్న ఆలయం



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



పుష్పాలంకరణలో అప్పన్న ఆలయం

సింహాచలం: సింహగిరి బుధవారం ఉగాది శోభను సంతరించుకుంది. శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని భక్తులు సింహగిరికి పోటెత్తారు. క్యూలో బారులు తీరి వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా స్వామివారి ఆలయంతో పాటు ఆస్థానమండపం..కల్యాణమండపాన్ని పుష్పాలతో అలంకరించారు. అలాగే భక్తులందరికీ దర్శనానంతరం ఉగాది పచ్చడి అందజేశారు. సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగింది.

విశేషంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వాడవాడలా ఉగాది సంబరాలు



చందనంతో వెంకన్న



తానాం గ్రామంలో పంచాంగ వింటున్న ప్రజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జెడ్పీటీసీ రాజు దంపతులు

పరవాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పరవాడ, పెదముషిడివాడ, లంకెలపాలెం, కన్నూరు, సాలాపువానిపాలెం , తాడి, రావాడ, భర్నికం, వెన్నలపాలెం, కలపాక, పి.బోనంగి, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. తానాంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో గ్రామ సర్పంచ్ కన్నూరి దేవి, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ పైల రామారావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఈ. బోనంగిలో ప్రత్యేక పూజలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు దంపతులు బుధవారం ఈ.బోనంగిలోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గొర్లివానిపాలెం నాయకుడు గొర్లి గోపి, మాజీ సర్పంచ్ గొర్లి కనకరావు, ఈ.బోనంగి మాజీ ఉప సర్పంచ్ బుగిడి గోవింద, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వెంకటాద్రిపై..

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకన్నను చందనంతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం.. రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభకృత్‌నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, అంతకాపల్లి, ఆరిపాక, సబ్బవరం గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. గుల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎంపీపీ బోకం సూర్యకుమారితో పాటు గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవిందు, నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, సర్పంచ్ బోను దేవుడమ్మ, బోను గంగునాయుడు, ఎంపీటీసీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



మల్లు నాయుడుపాలెం రామాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

బియ్యం ప్యాకెట్ల పంపిణీ



బియ్యం బస్తాలు అందజేస్తున్న పాస్టర్ విజయకుమార్

సబ్బవరం: ప్రభువు దయతోనే కులాలు, మతాలకు అతీతంగా పేదలకు సాయం చేస్తున్నామని గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చి పాస్టర్ కె. విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని రావులమ్మపాలెం గ్రామంలోని గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చిలో ఆయన తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా 30 మంది పేదలు, దివ్యాంగులకు 5 కిలోల బియ్యం ప్యాకెట్లు తో పాటు రవాణా చార్జీలు ఇచ్చారు. మరో ముగ్గురు వ్యక్తులకు రూ.వెయ్యి చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయకుమార్ కుమార్తెలు స్మైలీ, స్వీటీ, గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చి పెద్దలు పాల్గొన్నారు.